ప్రియతమా...! ఇక సెలవు!

మాకిరెడ్డి తిరుమలరెడ్డి

పాడిపంటలతో తులతూగే పల్లెటూరులో సంస్కృతీ సంప్రదాయాలకు నిలువుటద్దం మా కుటుంబం. నాన్నగారు ఎలిమెంటరీ స్కూలు టీచర్. పదవ తరగతి పాసైన నన్ను ఇంటర్మీడియట్‌లో చేర్పించారు. అమ్మ కొంచెం పాతకాలపు మనిషి. ఆ రోజు ఏడ్చినంత పని చేసింది. హాస్టల్‌లో ఉండి చదువుకుంటానంటే ఒప్పుకోలేదు. చివరకు కాలేజీకి ఇంటి దగ్గర నుంచి వెళ్తోస్తానంటే సరేనన్నది.

కాలేజీలో చేరి ఆరునెలలు గడిచాయి. నాకు తెలియకుండానే నా మనస్సు ప్రేమలో పడింది. మా ఊరు పక్కనే 'పల్లె' తనది. నేను చదివే కాలేజీలోనే బి.ఎ చేస్తున్నాడు. ఇంటర్మీడియట్‌లో పట్టీ కొట్టేంతవరకు తెలియలేదు. నాకు ప్రేమలో పడడం కాదు, పేకలలోతు కూరుకుపోయానని. నాన్నకు చాలా కోపమొచ్చింది. 'పంతులుగార మ్మాయి తప్పిందని ఊరంతా అనుకుంటున్నారట' అమ్మ కూడా చిర్రుబుర్రులాడింది. నాకు మాత్రం పరీక్ష పోయినందుకు బాధలేదు. 'తనను' కలిసే మార్గంలేదు కదా బెంగపడ్డాను. కాలేజీకి వెడితేనే 'తనను' కలవడం. తనను చూడకుండా ఉండలేకపోతున్నా. ఎలాగైనా కలవాలి. పటకం ఆలోచించాను. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతానని నాన్నను అడిగా, సరేనన్నారు. ఆతనిని కలిసినంత సంబరమేసింది. క్షణం కూడా ఆలస్యం చేయలేదు., కాలేజీకి వెళ్ళి 'తనని' కలిశా. పరీక్ష ఫీజు కట్టి అలావచ్చి గార్డెన్‌లో కూర్చున్నాం. నా చేతిని తన చేతుల్లోకి తీసుకుని చెప్పాడు– 'పెళ్ళి చేసుకుందాం' బి.ఎ కంప్లీట్ కాగానే పెద్దలకు చెప్పి ఒప్పిస్తాను, అందాక ఆగమన్నాడు. సరేనని బాసలు చేసుకుని నా మనసు , అతనికిచ్చి మరలి వచ్చా.

కాలం చాలా స్పీడుగా తిరిగినట్టుగా ఉంది. సప్లిమెంటరీ పరీక్షలో కూడా ఫెయిలయ్యాను. నాకు చదువు అబ్బదని అమ్మకు అర్థమైనట్టు ఉంది. "ఎంతకాలం అమ్మాయిని ఇంట్లో ఉంచుకుంటాం, పెళ్ళిచేసి అత్తవారింటికి పంపరా" అంటూ నాన్నను సతాయించడం మొదలు పెట్టింది. దాంతో నాకు సంబంధాలు చూడడం ప్రారంభించారు నాన్న. 'తనని' కలిసే మార్గం లేకపోయింది. మా ప్రేమ గురించి ఇంట్లో చెప్పడానికి ధైర్యం చాలడం లేదు. 'చెప్పినా ఒప్పుకోరు. తట్టుకోలేను. చెప్పి ఒప్పించగలననే నమ్మకం కూడా లేదు. ఎందుకంటే 'సంప్రదాయం' కుటుంబంలోని పిల్లను నేను. తను 'పల్లె' నివాసి. అతని నుంచి కూడా ఎలాంటి సమాచారం లేదు.

ఈలోపు ఓ రోజు రాత్రి 'రేపు అబ్బాయి వాళ్ళు అమ్మాయిని చూసేందుకు వస్తున్నారు' అని నాన్న అమ్మతో చెబుతున్నారు. ఇక నాకు దుఃఖం ఆగలేదు. నా గదిలో పడుకున్నా. ఊహ తెలిసిన తరువాత ఆ రాత్రే ఏడవడం. ఏ తెల్లవారుజాముకో మాగన్నుగా నిద్రపడుతుంటే అమ్మ వచ్చి లేపింది. 'పెళ్ళివారు వస్తున్నారు. లేచి తలంటుకో' అంటూ తొందర చేసింది. మా పెద్దక్క అపాటికే లేచి తలంటుకున్నది. టవల్‌తో జుట్టు తుడుసుకుంటుంది. బామ్మ పెరట్లో సన్నజాజి పందిరి కింద కుంకుళ్ళు కొడుతోంది. నాన్న, బావ పడక కుర్చీలలో కూర్చుని కాఫీ తాగుతూ పేపర్ తిరిగేస్తున్నారు. ఇల్లంతా సంతోషంగా ఉంది. నా పరిస్థితే నాకు అర్థం కావడం లేదు. ఏం చేయాలో పాలుపోనిస్థితి అయోమయంగా ఉంది. మైండాబ్సెంట్, బాడీ ప్రజెంట్. అమ్మ చెప్పిందల్లా తలూపుతూ చేస్తున్నా.

తొమ్మిదయింది. పెళ్ళివారు రానే వచ్చారు. పెద్దక్క నన్ను ముస్తాబు చేస్తూ చెబుతోంది– "అబ్బాయిది సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం. నెలకు అయిదువేలకు పైగానే వస్తుందట. మంచి వాడు. నాన్నగారు చెప్పారు. దేవుడి దయ వల్ల ఈ తొలి సంబంధం కుదిరితే ఆ ఏడుకొండలవాడి సన్నిధికి వస్తానని మొక్కుకున్నా". అంతలో నాన్న బయట గదిలో నుంచి కేక వేశారు– 'అమ్మాయిని తీసుకురండి' అంటూ. పెద్దక్క నా చేయి పట్టుకుని తీసుకువచ్చి పెళ్ళివారి ముందు చాపమీద కూర్చోబెట్టింది. నా మనసు ఆలోచించే శక్తిని కోల్పోయినట్టుంది. అచేతనంగా తయారయ్యా. పెద్దక్క నా వెనుక కూర్చుంది. 'అబ్బాయిని ఒక్కసారి చూడు. మరీ అందగాడు కాకపోయినా బాగానే ఉన్నాడు. చూడవే తలెత్తి' అంటూ చెవిలో పోరుతోంది. 'అమ్మాయికి సిగ్గు ఎక్కువగా ఉంది' అని ఒకరు, 'మహాలక్ష్మిలా ఉంది'. ఏం పేరమ్మా అని మరొకరు ప్రశ్నలు వేస్తున్నారు. కొద్దిగా నోరు పెగల్చుకుని 'మహాలక్ష్మి' అని చెప్పాను. శుభం పేరుకు తగ్గరూపం అని ఎవరో కితాబిచ్చారు. "మాస్టారూ... అమ్మాయిని ఎంతసేపు కూర్చోబెడతారు లోపలికి పంపండి' పిల్లవాడి తండ్రి అనుకుంటూ నాకు ఎక్కడ దిష్టి తగులుతుందోనని లోపలికి పంపమంటున్నారు. 'పెద్దమ్మాయి... అమ్మాయిని లోపలికి తీసుకెళ్ళమ్మా' అని నాన్న చెప్పడంతో లోపలికి వచ్చాం.

అమ్మ అడిగింది అబ్బాయి నచ్చాడా అని. అంతలోనే నాన్న "ఏంటమ్మా ముహూర్తం పెట్టించనా, వాళ్ళకి బాగా నచ్చావట. కట్నకానుకలు పెద్దగా ఏమీ అడగడం లేదు" అని అడగడంతో ఎటూ తేల్చుకోలేకపోయాను. ప్రేమించినవాడు చేసుకుంటానన్నాడే కానీ, ఇప్పటి వరకు చేతలు శూన్యమయ్యాయి. ఇలాంటి ఆలోచన్ల నడుమ ఏమీ చెప్పకుండా మిన్నకుండిపోయా. మౌనం అర్ధాంగీకారంగా భావించి ముహూర్తం పెట్టించారు.

మాఘమాసంలో పెళ్ళి. చేసేది లేక తలవంచాను. హనీమూన్‌కి బెంగుళూరు, ఆంధ్రా ఊటీ అరకులోయ వెళ్ళి వచ్చాం. వెంటనే కాపురం పెట్టించారు. ఆయన చాలా మంచివారు. ఏ లోటు లేకుండా అపురూపంగా చూసుకుంటున్నారు. నాలుగేళ్ళు నాలుగు రాత్రుల్లా గడిచాయి. పాపకు తల్లినయ్యాను. ఉద్యోగ రీత్యా ఆయనకు ప్రమోషన్ వచ్చింది. ప్రేమలో పోగొట్టుకున్న ఇంటర్ పరీక్ష కూడా పూర్తి చేశాను. "బి.ఎ ప్రైవేట్‌గా చదువు, పేరు ప్రక్కన మహాలక్ష్మి బి.ఎ అని పెట్టుకుందువు" అంటూ ఓరోజు నా నడుంపొంపులో చిటికేస్తూ చెప్పారు. ఆ మూడ్‌లో సరేనన్నాను.

మాకు యూనివర్సిటీ దగ్గరే కావడంతో ఆయన ఆఫీసుకు వెళ్ళిన తరువాత బయలుదేరాను. క్యాంపస్ చాలా కోలాహలంగా ఉంది. ఒక్కసారి నా మనస్సు ఇంటర్మీడియట్ రోజులవైపు పరుగుతీసింది. గుండెనంతా ఎవరో పిండినట్టయింది. 'తను' ఎక్కడ ఉన్నాడో. ఏం చేస్తున్నాడో కూడా తెలియదు. దాదాపు అయిదేళ్ళు కావస్తోంది. మనసు ఎటో వెళ్ళిపోతోందని ఆలోచనలను కట్టివేశాను. 'ప్రైవేట్ స్టడీ' సెక్షన్‌కు వెళ్ళి బి.ఎ ఫాం తీసుకుని వెనక్కి మరలి వస్తున్నా.



అంతే ఒక్కసారి కాళ్ళు తడబడ్డాయి. ఒక కెరటం ఉవ్వెత్తున లేచి కడలిని అల్లకల్లోలం చేసినంత పన యింది. నేను భ్రమపడుతున్నానా, లేక నిజమా. నమ్మలేకపోతున్నా.. నా చేతిని ఒకసారి గిల్లి చూసుకున్నా.

ఎస్! భ్రమకాదు, కలకాదు, నిజమే. నోడౌట్ ఇటు వస్తున్నది విల్సన్. నేను ఇంటర్‌లో ప్రేమించిన వ్యక్తి. ఆరోజు కాలేజీ గార్డెన్‌లో కలుసుకోవడం మళ్ళీ ఇన్నాళ్ళకు మనిషి కొంచెం వళ్ళు చేశాడు. గడ్డం పెంచుకుని నీట్‌గా టక్ చేసుకుని వస్తు న్నాడు. ఇటే వస్తున్నాడు. మనసును నిగ్రహించుకో లేకపోయాను. రెండు అడుగులు ముందుకేశాను. నేను వేరొకరి భార్యననే విషయం మర్చిపోయా. ఎదురెళ్ళి నిలబడ్డా. ఒక్కసారి తను కూడా స్టన్ అయ్యాడు. కొద్దిగా తేరుకుని 'మహాలక్ష్మీ' అన్నాడు. నాకు కోపమొచ్చి నిలదీశాను. 'పెళ్ళి చేసు కుందామని బాసలు చేసి అడియాశలు చేస్తావా అంటూ కోపగించుకున్నాను. "ఎం.ఎ చేద్దామని ఆంధ్ర యూనివర్సిటీకి వెళ్ళిన సమయంలో నీ పెళ్ళి జరిగింది. ఆ విషయం ఒక్క రోజు లేటుగా తెలిసింది. ఒక్కరోజు ముందు తెలిసివుంటే ఈరోజు పరాయి వ్యక్తి భార్యగా నీవు నాముందు నిలబడాల్సి వచ్చేదికాదు. నీకు ఈవిధంగా సంజా యిషీ ఇవ్వాల్సి ఉండేది కాదు. కేవలం ఒక్కరోజు ఆలస్యం కారణంగా నా జీవితంలో ఏమైతే చేజా ర్చుకోకూడదనుకున్నానో అదే కోల్పోయాను. ఆ తరువాత ఇక్కడ పిహెచ్‌డి చేస్తూండిపోయాను. ప్లీజ్ నన్ను నమ్ము మహాలక్ష్మీ" అంటూ భోరున ఏడ్చాడు. అప్పటికే నా కోపం చల్లారిపోయింది. మనసు ద్రవించింది. అతని ఏడుపు చూసి తట్టు కోలేకపోయాను. బాధ, దుఃఖం తుడిగుండంలా పెనవేసుకుని రావడంతో కళ్ళు వర్షించసాగాయి.

ఆ తరువాత మళ్ళీ నా మనస్సు అతని కోసం వెంపర్లాడింది. పెళ్ళి చేసుకున్నాననే స్పృహ లేకుండా పోయింది. మావారు ఆఫీసుకు వెళ్ళిన సమయంలో ఏదో పనిపై బయటకు వచ్చి అతన్ని కలవడం మానుకోలేకపోయాను. ఒకరోజు "ఎంత కాలం ఉంటావు. మంచి అమ్మాయిని చూసు కుని పెళ్ళి చేసుకో" అని అడిగా. దానికి తను చెప్పిన సమాధానం నన్ను నిశ్చేష్టురాల్ని చేసింది. "పెళ్ళంటూ చేసుకుంటే మహాలక్ష్మినే చేసుకో వాలని డిగ్రీలోనే నిర్ణయం తీసుకున్నా, నీకు పెళ్ళయింది. కాబట్టి నాకు ఈ జన్మలో పెళ్ళి యోగ్యత లేదు. ఇలానే ఉండిపోతా" అని చెప్పి కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. "మనకు అరవై ఏళ్ళు వయస్సు వచ్చేవరకు ఇలాగే కలుస్తుండాలి. నాకు ఈ జన్మకు పెళ్ళి లేదుగా. నా మాట మన్ని స్తావా" అంటూ ఆశతో అడిగాడు. నేనేం చెప్పలేక మౌనంగా ఇంటిదారి పట్టాను.

ఆరోజు రాత్రి నిదుర పట్టలేదు. కళ్ళు మూసు కుని పడుకున్నా. అతని మాటలు తట్టి లేపు తున్నాయి. ఇక పెళ్ళి చేసుకునే ప్రసక్తే లేదని భీష్మించుకు కూర్చున్న ప్రియుని కోరిక మన్నించాలని కాసేపు. తనను ప్రాణప్రదంగా చూసుకుంటున్న భర్త పరువు ప్రతిష్ఠలను దృష్టిలో ఉంచుకుని తిర స్కరించాలని కాసేపు. ఏం చేయాలి... ఏం చేయాలి... మనసులో రేగిన ఆలోచనల తుపాను ఆగలేదు. నిద్రపట్టక బెడ్‌పై అటూ ఇటూ పదేపదే కదలుతుండడంతో- ఆయనకు మేలకువ వచ్చి "లక్ష్మీ... ఏంటి ఇంకా నిద్రపోలేదా" అని అడగ డంతో ఉలిక్కిపడ్డాను. 'ఏంతో.. ఈరోజు సలతగా ఉందండి... నిద్ర రావడం లేదు' నఅడంతో ఆయన తన కౌగిట్లోకి తీసుకుని నా తలను నిమురు తుంటే ఆయన ప్రేమ హృదయ స్పందనకు నా కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి. తెల్లవారు ఆయన లేపేవరకు మేలకువ రాలేదు. నన్ను నిర్లక్ష్యం చేసిన ప్రియుని కోసం బంగారం లాంటి భర్తకు ద్రోహం తలపెట్టి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని 'సిక్త్ సెన్స్' హెచ్చరికను కాదనలేకపోయా.

చివరిగా ఒక నిర్ణయానికి వచ్చి విల్సన్‌ను కలిశా. "నా భర్త స్థానంలో నీవుంటే నీ భార్య ఆమె ప్రియుడ్ని చాటుమాటుగా కలవడం నీవు సహించగ లవా? తను దక్కించుకోలేనిది మరొకరి సొంతం అయినపుడు, దానిని తిరిగి ప్రేమ పేరుతో పొందాలనుకోవడం న్యాయమేనా?" అని అతన్ని ప్రశ్నించే సరికి నా మాటల్లోని ఆంతర్యం గ్రహించి ఏమీ మాట్లాడలేక అచేతనంగా నిలబడిపోయాడు. 'జీవితంలో అన్నీ మనం ఊహించినవి జరగవు. అనూహ్యమైన సంఘటనలెన్నో జీవితాన్ని అనేక మలుపులు తిప్పుతాయి. కాలం చూపిన దారిలో జీవనయానం సాగించాల్సిందే తప్ప, కాలానికి ఎదు రీది, ఆ మలుపుల నుంచి బయటకు వస్తే- అది అడ్డదారి తొక్కినట్టవుతుంది. ఏ మలు పులోనో మనం విడిపోయాం. ఆ ఎడబాటులో నా జీవితం వేరొకరికి అంకితమై కొత్త మలుపు తిరిగింది. ఇన్నేళ్ళ తరువాత చారసపడిన మనం ఆనాటి బాసల కోసం ఏకం కాలేము. ఒకరికి అర్పితమైన నా కోసం నీ ముందున్న జీవితాన్ని బలి చేసుకోకు. గతం ఓ కలగా మర్చిపో... గమ్యం ఏమిటో తెలుసుకుని ముందుకు సాగిపో ప్రియతమా... ఇక సెలవు!!" అని చెప్పి బయటకు వస్తున్న నాకు కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. ●